బండ్లగూడ కమిషనర్‌పై అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు


జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రపై మేయర్ లతాప్రేమ్‌గౌడ్, కార్పొరేటర్లు గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సమావేశాన్ని నిర్వహిస్తామంటే కమిషనర్ పట్టించుకోకుండా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి అభివృద్ధి పనుల శంకుస్థాపనల్లో పాల్గొనేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఏడాదిన్నరగా వీధిదీపాల వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గురువారం కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారంపై చర్చిద్దామని కమిషనర్ శరత్‌చంద్రను కోరామన్నారు. ఆయన తమ మాటలు పట్టించుకోలేదని, సమావేశాన్ని ఏర్పాటు చేయకుండా చోద్యం చూస్తున్నారన్నారు. గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వెళ్లే సమయం ప్రజల అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసే కౌన్సిల్ సమావేశానికి లేదా అని ప్రశ్నించారు. తనకు సమయంలో లేదని వారం తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేస్తానంటూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు తలారి చంద్రశేఖర్, ప్రశాంత్‌నాయక్, సంతోషి రాజిరెడ్డి, నిఖిలా సంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆసియా ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమావేశాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్



బండ్లగూడ : రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. ఈ నెల 29న పీవీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ముదిరాజ్‌ల సమావేశాన్ని ముదిరాజ్ బంధువులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానికి మొదటి చైర్మన్‌గా తనను నియమించి ముదిరాజ్‌లకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొదటిసారి ఏర్పాటు చేసిన ముదిరాజ్ కార్పొరేషన్ విధివిధానాలను రూపొందించేందుకు రాష్ట్రంలోని ముదిరాజ్ విద్యావంతులు, ఉద్యోగులు, అన్ని కుల సంఘాల నాయకులు, మత్స్య హహకార సంఘాల నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటానన్నారు.

కుష్టు బాధితులకు మెరుగైన సేవలు


చెప్పులు అందజేస్తున్న ఏడీపీ సంస్థ ప్రతినిధులు

మణికొండ: కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారికి లెప్రా సొసైటీతో కలిసి తమ వంతు సహకారం, సేవలను అందిస్తామని హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ గ్లోబల్ లీడర్ సంస్థ అయిన ఏడీపీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, హెచ్‌ఆర్ హెడ్ సుజ్ఞాన్ వెంకటేశ్ అన్నారు. గురువారం నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా తయారు చేసిన పాదరక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తమ సంస్థ సీఎస్‌ఆర్ నిధులను వెచ్చిస్తున్నామన్నారు. కుష్టు, ఇతర వైకల్యాలతో బాధపడుతున్న వారు ఎదుర్కొంటున్న బహుముఖ పోరాటాలను గుర్తిస్తూ వారితో పాటు ఫైలేరియాసిస్‌తో పాటు పడుతున్న వారికి కస్టమైజ్ పాదరక్షలను తయారు చేయించి అందిస్తున్నామన్నారు. ఏడీపీ ట్రామా కేర్ కేంద్రాన్ని నిర్మించటానికి, వైద్య పరికరాలు, సామాగ్రిని అందించటానికి సహాయం అందించిందన్నారు. మంత్ ఆఫ్ కేరింగ్ చొరవలో భాగంగా ఏడీపీ ఉద్యోగులు విద్యా వర్క్‌షాప్‌లు, పరిశుభ్రతపై డ్రైవ్‌లు, కిరాణ సామగ్రి అందించటం, రక్తదానం తదితర కార్యక్రమాల్లో తమ సంస్థ ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏడీపీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, గ్లోబల్, ఇండియా ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ సచ్చిదానంద ఐతాల్ , సీనియర్ డైరెక్టర్ జార్జ్ మాథ్యూస్, లెప్రా సొసైటీ ప్రతినిధులు సురేష్, కామేష్, రమేష్, అరుణ్‌కుమార్, డాక్టర్ సత్యరత్న పాల్గొన్నారు.

చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ వేయించాలి


వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

బండ్లగూడ: మెదడు వాపు నివారణకు 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా జపనీస్ ఎన్సెఫలిటీస్(జేఈ) వ్యాక్సిన్ వేయించాలని రంగారెడ్డి జిల్లా డిస్టిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, కిస్మత్‌పూర్ పాఠశాలల్లో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడు వాపు నివారణకు ఆగస్టు 15 వరకు విద్యార్థులందరికీ ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయనున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.విమల, హెచ్ఈఓ ఎం.శ్రీనివాస్, సలమాన్‌రాజ్, ఏఎన్‌ఎంలు టి.అమృత, పి.మంజుల, ఆశావర్కర్లు ఎం.రమణ, వై.అరుణ, జి.సౌభాగ్య, టి.అంబిక, హైదర్షాకోట్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ పాఠశాలలో..



అత్తాపూర్: రోగ నిర్ధారణ శక్తిని పెంచుకోవడంతో పాటు, మెదడు వాపు వ్యాధి నుండి రక్షించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న టీకాను విద్యార్థులు తప్పక వేయించుకోవాలని రాజేంద్రనగర్ హెల్త్ ఆఫీసర్ చెన్నకేశవులు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల, హసన్ నగర్ ఎంఎం పహాడి హై స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు మెదడు వాపు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్తాపూర్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయురాలు ఎఎన్‌ఎం సుజాత, రామేశ్వరి, యశోద, ఆశా వర్కర్లు వీరమని, అనితా పాల్గొన్నారు.

ఐకమత్యాన్ని చాటిచెప్పాలి


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అత్తాపూర్: విద్యార్థి దశలోనే ఐకమత్యాన్ని చాటిచెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు వ్యవస్థపై ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి రామిరెడ్డి అన్నారు. గురువారం అత్తాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీలత, హైదర్‌గూడ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం నిర్మల జ్యోతితో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్ష సప్తహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషలు, సంస్కృతి సంప్రదాయాలు వేరుగా ఉన్నా మనమంతా ఒక్కటే అనే భావనతో జీవించాలన్నారు. ప్రతిరోజూ పాఠశాలలో జరిగే ప్రేయర్‌లో జనగణమన లాంటి గేయాలు ప్రైమరీ విద్యలోనే తెలిసి ఉండాలని అందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. ఆటాపాటలతో కూడిన విద్య స్వతంత్రంగా ధైర్యంగా స్పష్టంగా చెప్పగలిగేతత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు మెరుగ్గా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, బంజారా నృత్యాలు, కోలాటాలు, బతుకమ్మ స్టెప్పులతో అలరించారు. నృత్యాలు చేసిన హారతి, లాస్య, నందిని, స్వీటీ, రాకేష్, ప్రీతం, రాకేష్, తులసీ, సునీత, శ్రీధర్ రెడ్డి తదితరులను అధికారులు అభినందించారు.

ఎస్టీనని వివక్ష చూపుతున్నారు


జాథోతి హుస్సైన్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్

బండ్లగూడ: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి స్థానిక కార్పొరేటర్‌నైన తనకు ఎలాంటి సమాచారం లేకుండా శంకుస్థాపనలు చేస్తున్నారని, తాను ఎస్టీ కార్పొరేటర్ అయినందునే స్థానిక కమిషనర్ శరత్‌చంద్ర తనపై వివక్ష చూపుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబల్స్ సభ్యులు జాథోతి హుస్సైన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌నాయక్ మాట్లాడుతూ తన డివిజన్‌లో కమిషనర్ శరత్‌చంద్ర ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించడం లేదన్నారు. ఏ సమస్య వివరించినా వాటిని కొట్టి పారేస్తున్నాడన్నారు. తన డివిజన్‌లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. పలుమార్లు తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ఎస్టీ కార్పొరేటర్‌నని చులకన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.


పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, వైస్ చైర్మన్


ఊరేగింపులో పాల్గొన్న అశోక్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్

ఘనంగా బోనాల జాతర

- గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు
- పాటలతో హోరెత్తిన గ్రామాలు
- సందడిగా తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపు
- అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్న భక్తులు


ఖానాపూర్‌లో తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ఆషాడ మాసంలో గ్రామ దేవతలకు నిర్వహించే బోనాల ఉత్సవాలు గురువారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంతో పాటు ఖానాపూర్‌లో ఘనంగా జరిగాయి. మహిళలు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం భక్తులు ఊరేగింపుగా దేవాలయాలకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలతో సందడి నెలకొంది. నార్సింగిలో రాత్రి ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. యువకులు తీన్మార్ స్టెప్పులతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్‌లతో పాటు నాయకులు, కౌన్సిలర్‌లు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఖానాపూర్‌లో కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, దేవాలయాల అభివృద్ధి కమిటీ నాయకుల ఆధ్వర్యంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాలు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, కోకాపేట, గండిపేట, గొలిదొడ్డి గ్రామాల్లో ఈ నెల 28న బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వట్టినాగుపల్లిలో ఆగష్టు 1న బోనాలు నిర్వహించనున్నారు.

వైద్యాధికారుల బదిలీ

మణికొండ: గండిపేట మండల వైద్యాధికారి డాక్టర్ పద్మను రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్‌ను కింగ్ కోఠిలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసింది. వారి స్థానంలో మండల వైద్యాధికారిగా హైదరాబాద్ నుంచి డాక్టర్ సత్యరత్న, విస్తరణాధికారిగా సంగారెడ్డి నుంచి శ్రీధర్‌ను బదిలీ చేసింది. దీంతో వారు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సత్యరత్న మాట్లాడుతూ మండల పరిధిలోని బస్తీ దవాఖానాలు, నార్సింగిలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలను అందించేలా చూస్తానన్నారు.

జేపీ నడ్డాను కలిసిన బీజేపీ నేతలు



రాజేంద్రనగర్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో గురువారం పలువురు బీజేపీ నేతలు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ బీజేపీ నాయకులు, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని డీకే అరుణ నాయకత్వంలో బీజేపీని మరింత కృషి చేయాలని నడ్డా సూచించారు. నడ్డాను కలిసిన వారిలో నాయకులు నవీన్ రెడ్డి, కిరణ్ రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాగులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



శంషాబాద్ రూరల్: వాగులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటి పరిధిలోని ఇందిరానగర్ దొడ్డి శివారులో ఉన్న వాగులో గురువారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి అతను మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నల్లపోచమ్మకు బంగారు కానుక


అమ్మవారికి బంగారు కిరీటం, కవచం, చీరను తీసుకొస్తున్న దాతలు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా మేకలబండ నల్లపోచమ్మ అమ్మవారికి భక్తుడు తన ధాతృత్వాన్ని చాటుకున్నాడు. తుడి సుభాష్, తుడి ప్రవీణ్ దంపతులు అమ్మవారికి బంగారు కిరీటం, కవచం, చీరను సమర్పించారు. అమ్మవారి మహత్యం తెలుసుకున్న వారు ఆభరణాలను చేయించి గురువారం లాల్‌దర్వాజా కోట మైసమ్మ ఆలయం నుంచి నల్లపోచమ్మ ఆలయం వరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్న వెంకటరమణ పర్యవేక్షణలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. శుక్రవారం ఈ ఆభరణాలను అమ్మవారికి సమర్పించనున్నారు.

క్యాబ్‌ల సమస్య పరిష్కారానికి చర్యలు

- యాప్ ఆధారిత క్యాబ్ సర్వీసుల పెంపు
- రద్దీ సమయంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం దిశగా..

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో రద్దీ సమయంలో పెరుగుతున్న క్యాబ్‌ల కొరతను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి. గుర్తింపు పొందిన యాప్ ఆధారిత క్యాబ్ ఆపరేటర్లను సమన్వయం చేసుకుంటూ వాటి సంఖ్యను పెంచుతున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దు ఫీజు మాఫీకి సంబంధించిన చర్యలపై కూడా సంబంధిత క్యాబ్ అగ్రిగేటర్లతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. అరైవల్ కేంద్రం వద్ద ప్రయాణికులకు రవాణా సౌకర్యాలకు సంబంధించిన సమాచారం కోసం ఇప్పటి వరకు ఉన్న హెల్ప్‌డెస్క్‌తో పాటు అదనపు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ పుష్పక్ బోర్డింగ్ పాయింట్లను ప్రయాణికుల సౌలభ్యానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. అనధికారికంగా జరిగే క్యాబ్స్, ఇతర సర్వీసు ఆపరేటర్ల నియంత్రణపై సైబరాబాద్ పోలీసులతో కలిసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి


విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న జితేందర్, చైర్మన్ నరేందర్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ తమకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే మరింత మనకు తిరిగి దక్కుతుందన్నారు. ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లలే ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్నారని, వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డి. పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, బి. ముత్యాలు, పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రంగారెడ్డి జిల్లాకు తీరని అన్యాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

శంషాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో రంగారెడ్డి జిల్లాను పూర్తిగా విస్మరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జాతీయరహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం గత పదేళ్లలో రూ.లక్షల కోట్లు విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌ను అవమానించేలా శాసన సభలో వ్యవహరించిందన్నారు. రాష్ట్ర సర్కారు ఏ మాత్రం కొత్తదనం, సంక్షేమం లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. అందులో రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నంద కిశోర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రూ.4.49 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


బండ్లగూడలో అభివృద్ధి పనులకు శంకస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు గురువారం ఆయన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో రూ. 4.49 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 1,10,11,17 డివిజన్లలోని తిరుమల హిల్స్, ఇందిరమ్మ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ, వినాయక్‌నగర్, ఓల్డ్ విలేజ్ దర్గాలలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గోతులమయంగా మారిన రోడ్లు, శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరిస్తున్నామన్నారు. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తేవాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ బొర్రా రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, పుష్పమ్మ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, నాయకులు నవాజ్ ముంతాజ్, మలాకీరత్నం, పాపయ్యయాదవ్, నరేష్, శివజ్యోతి, నదీం, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వర్సిటీకి పూర్తి స్థాయి అధికారులను నియమించాలి

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని సమస్యలు పరిష్కారానికి ఇన్‌చార్జ్ అధికారులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి అధికారులను నియమించాలని తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం(టాసా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. విశ్వవిద్యాలయం వీసీ,రిజిస్ట్రార్, అసోసియేట్ డీన్ పోస్టుల్లోనూ ఇన్‌చార్జ్‌లే ఉన్నారన్నారు. దీంతో సిబ్బంది, ప్రొఫెసర్ల బదిలీలు, పదోన్నతుల కోసం అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుత వీసీ రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శిగా ఉన్నందున విశ్వవిద్యాలయానికి సమయం కేటాయించడం లేదని దీంతో విశ్వవిద్యాలయ అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీకి నిధులు లేవని .విద్యార్థుల సంఖ్య పెరిగినా సరిపైన సిబ్బంది లేరని, ఉన్న వారు పదవీ విరమణ పొందుతున్నా కొత్త వారిని నియమించడం లేదన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే విశ్వవిద్యాలయం వీసీతో పాటు ఇతర అధికారుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

శంషాబాద్ రూరల్: మండల పరిలోని జూకల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానికులు గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. ఇక్కడ పని చేసిన ప్రధానోపాధ్యాయుడు కిషోర్‌కుమార్ పిల్లోనిగూడ పాఠశాలకు బదిలీ అయ్యారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రాధిక, అశ్విని, సునీతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలీకోల్‌తండా పాఠశాల ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ దేవానందం, నాయకులు వేణురెడ్డి, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: నాటిన ప్రతిమొక్కను సంరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదేనని పాల్మాకుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో గురువారం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. వెల్స్ ఫార్గో సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి నిధులను వెచ్చించి కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో వెయ్యికి పైగా మొక్కలను నాటారు. మియావాకి విధానంలో ఈ మొక్కలను నాటడంతో పాటు విద్యార్థులను ఎర్త్ లీడర్స్‌గా నియమించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.మాధవి, ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ.

రాజేంద్రనగర్: నిషేధిత సైలెన్సర్లను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ డీసీపీ బాలాజీ అన్నారు. గురువారం ఆయన రాజేంద్రనగర్ పరిధిలో నిషేధిత సైలెన్సర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టుబడిన యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలకు పునరావృతం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఐ నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీఎస్ రీజినల్ అథ్లెటిక్స్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలోని 3 రోజుల కేవీఎస్ రీజినల్ అథ్లెటిక్ ఈవెంట్–2024 గురువారం ఘనంగా ప్రారంభమైంది. అండర్ 14, 17, 19 బాలుర, బాలికల విభాగాల్లో జరగనున్న ఈ క్రీడా పోటీలు గోల్కొండ సుబేదార్ మఖాన్ సింగ్ అథ్లెటిక్స్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ జలన్ పీ.ఎస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి రోజు పోటీల్లో భాగంగా షాట్‌పుట్, హై జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్ల రేసులను నిర్వహించారు. కార్యక్రమాల్లో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నెం.1 గోల్కొండ ప్రిన్సిపాల్ సురేష్ కటోచ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.